

బైక్ విక్రయం పేరుతో కుచ్చుటోపీ
మంచి కండిషన్‌లో ఉన్న బైక్ తక్కువ ధరకు విక్రయిస్తారని ఫేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటన నమ్మి మోసపోయిన యువకుడు ఎస్పీని ఆశ్రయించాడు. - 8లో..



హత్య కేసు విచారణ వేగవంతం
సీఎస్‌పురం మండలం చింతలపాలెంలో బాలుడి హత్య కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. అనుమానితులను విచారిస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/27

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

మాస్టార్లు

తల్లి..తండ్రి..గురువు..దైవం అంటారు... తల్లిదండ్రుల తరువాత మన జీవితాన్ని ప్రభావితం చేసి మార్గనిర్దేశనం చేస్తూ సన్మార్గంలో లక్ష్యసాధన దిశగా నడిపించే వ్యక్తి గురువు. ఆ దైవం కన్నా గురువుకే ప్రాధాన్యత ఎక్కువ. వృత్తిపట్ల నిబద్ధతతో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే గురువులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాం.
నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి 'బెస్ట్ టీచర్' అవార్డులతో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించే గురుపూజోత్సవంలో సత్కరించనుంది.



సీఎం పథకాలతో లబ్ధిపొందిన విద్యార్థులతో టీచర్ మౌలాలి (ఫైల్)

ప్రయోగాత్మకంగా బోధన
● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన గేరా నివేదిత



టంగుటూరు: సైన్స్ పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా బోధించి ప్రశంసలందు కుంటున్నారు టంగుటూరు మండలం వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న గేరా నివేదిత. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. గేరా నివేదిత 2005-2012 వరకు పామూరు మండలం వీరభద్రాపురం జెడ్పీ హైస్కూల్లో, 2012-2021 వరకు కొత్తపట్నం జెడ్పీ హైస్కూల్లో పనిచేశారు. 2021 నుంచి ప్రస్తుతం వల్లూరు పాఠశాలలో పని చేస్తున్నారు. విద్యార్థులకు కృత్యాధార బోధన, ప్రాజెక్టులు-నమూనాలు, రోల్‌ప్లే, సెమినార్లు, ప్రయోగాలతో పాఠ్యాంశాల పట్ల జిజ్ఞాస కలిగిస్తున్నారు. లో కాస్టు- నో కాస్టు, ప్రత్యామ్నాయ పరికరాలను ఉపయోగించి బోధన సాగిస్తున్నారు. కరోనా సమయంలో 'సైన్స్ ఇన్ ఈజ్' యూట్యూబ్ చానల్ ద్వారా 2 వేల మంది విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించారు. ఎస్‌సీఈఆర్‌టీ, ఎస్ఎస్ఏల ఆధ్వర్యంలో 2018 నుంచి అనేక ఉపాధ్యాయుల ఇన్‌సర్వీసు, శిక్షణలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా పని చేశారు. 7, 8 తరగతుల పాఠ్య గ్రంథ రచనలో పాల్గొన్నారు. సీబీఎస్ఈ పాఠ్య గ్రంథాల తర్జుమా చేశారు. ఇటీవల తెలుగు అకాడమీ వారి డీఎస్సీ మెటీరియల్ తయారీలో పాల్గొన్నారు. జిల్లా డీసీఈబీ వారి పదో స్టడీ మెటీరియల్ తయారీలో 2017 నుంచి ఉన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ వారి 'మన కోసం మన చట్టాలు' అన్న గ్రంథ రచనలో సహకారం అందించారు. అకడమిక్ పాఠ్య పుస్తకాల రచన కమిటీలో సభ్యులుగా పని చేస్తున్నారు. 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, బీటీఏ వారి సావిత్రీ బాయి పూలే అవార్డు పొందారు. రాష్ట్ర జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరంలో అకడమిక్ మెంబర్‌గా పని చేస్తున్నారు.

విద్యాబోధన..చారిత్రక పరిశోధన
● రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి



వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)



వెంకటేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న గరికపాటి, బూచేపల్లి (ఫైల్)

ఒంగోలు: మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి అంచెలంచెలుగా రాణిస్తూ ఏకేయూ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కొణిజేడు వాసి డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ప్రభుత్వం ప్రకటించింది. పోస్టుగాడ్యుయేషన్, పీహెచ్‌డీని ఉస్మానియా యూనివర్శిటీలో అభ్యసించారు. అనంతరం సంతనూతలపాడులోని మాగుంట సుబ్బరామిరెడ్డి కాలేజీలో లెక్చరర్‌గా కొద్దికాలం పనిచేశారు. మాగుంట విద్యాసంస్థలకు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గాను బాధ్యతలు నిర్వహించారు. 2009లో ఒంగోలులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పీజీ సెంటర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనచేసి, 2021లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. తాజాగా ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంగా ఏర్పడడంతో దానికి డీన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కేవలం పాఠ్యాంశాల బోధనతోనే సరిపెట్టకుండా ఆయన చరిత్రపై అనేక పరిశోధనలు చేశారు. ఆరు పుస్తకాలను రచించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ అవధాని గరికపాటి నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డిలు గతంలో సత్కరించారు. ఆయన రాసిన 30కిపైగా వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ముద్రితమయ్యాయి. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ సహకారంతో ఒక మేజర్ రీసెర్చి ప్రాజెక్టును పూర్తిచేశారు. ప్రభుత్వం ప్రచురించిన డిగ్రీ, పీజీ పాఠ్యపుస్తకాలకు సంపాదకత్వం వహించారు. ఏడు జాతీయ సదస్సులను ఒంగోలులో నిర్వహించారు. వివిధ జాతీయ, రాష్ట్రస్థాయి అకడమిక్ సంస్థల్లో సభ్యునిగా ఉన్నారు.

పిల్లలతో మమేకమై..
● బెస్ట్‌టీచర్‌గా ఎంపికైన షేక్ మౌలాలీ



షేక్ మౌలాలీ (ఫైల్)

మార్కాపురం: ఉపాధ్యాయ వృత్తినే దైవంగా భావిస్తూ, విద్యతో పాటు సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య విషయాలు, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యతలను పెంచే విషయాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు తర్లుపాడు మండలం లింగారెడ్డి కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న షేక్ మౌలాలి. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. పాఠశాలను రంగు రంగుల బొమ్మలతో, పిల్లలను ఆకట్టుకునేలా తయారు చేశారు. ఎక్కడ పనిచేసినా గ్రామస్తులు, పిల్లలతో మమేకమై పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమంలో తల్లిదండ్రులను భాగస్వాములను చేసి విజయవంతం చేయటం మౌలాలి ప్రత్యేకత. పిల్లలకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా లోకాస్ట్-నోకాస్ట్ బోధనోపకరణాలు ఉపయోగించి పిల్లలతో ప్రాజెక్టు వర్కులు చేయిస్తుంటారు. 2001లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా, 2002లో జన్మభూమిలో బెస్ట్ టీమ్ లీడర్‌గా, 2004లో యూటీఎఫ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2013లో శాంతి వనం ఒంగోలు వారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2013లో విద్యాశాఖ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2014లో ఘంటసాల అకాడమీ అక్షరాస్యత విభాగంలో ఉత్తమ సేవా పురస్కారం, లిటిల్ చాంప్స్ అకాడమీ వారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, స్టార్ మాసపత్రిక వారి ఆంధ్ర స్టార్ పురస్కారం అందుకున్నారు.

విభిన్నప్రతిభతో రాణించి...
● బెస్ట్‌టీచర్‌గా ఎంపికైన వల్లభనేని ఆంజనేయులు



తరగతి గదిలో లెక్కలు బోధిస్తున్న ఆంజనేయులు (ఫైల్)

మార్కాపురం: విభిన్న ప్రతిభావంతుడైనా.. లెక్కలు చెప్పడంలో ఆయన దిట్ట. మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల లెక్కల మాస్టారుగా పనిచేస్తున్న వల్లభనేని ఆంజనేయులు ప్రత్యేకమైన వ్యక్తి. ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో క్రమేపీ చూపు మందగించింది. స్నేహితుల సాయంతో ఇంటర్ విద్యను పూర్తిచేసి ఆ తరువాత ఎంఎస్సీ మ్యాథ్స్, బీఈడీ పూర్తిచేసి ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించారు. దొనకొండ మండలం రామాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు 2006లో ఎస్‌జీటీ ఉపాధ్యాయునిగా ఎంపికై జిల్లాలో 3వ ర్యాంకు సాధించారు. 2008లో మళ్లీ స్కూల్ అసిస్టెంటుగా ఉద్యోగం సాధించారు. ఆయన చిన్నగుడిపాడులో చేసినా.. మార్కాపురం హైస్కూల్‌లో చేసినా తన ప్రత్యేకతను నిరూపించుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ కోచింగ్ క్లాసులకు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఐదేళ్ల నుంచి ఆయన శిక్షణ ఇస్తున్నారు. ఐదేళ్ల నుంచి మార్కాపురం డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న రామానుజన్ టాలెంట్ టెస్టు, పేపర్ తయారీ, రిజల్ట్, నిర్వహణ బాధ్యత మొత్తం ఈయనే చూస్తున్నాడు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్ అవార్డుతో సత్కరించనుంది.

చదువుతో పాటూ క్రీడల్లోనూ ప్రోత్సాహం
● రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా రామాంజనేయులు



రామాంజనేయులను అభినందిస్తున్న మంత్రి సురేష్ (ఫైల్)



రామాంజనేయులు (ఫైల్)

దొనకొండ: దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన 1988-1997 వరకు పామూరు మండలం వీరభద్రపురంలో స్కూల్ అసిస్టెంట్‌గా, 1999-2001 వరకు దొనకొండ మండలం ఇండ్లచెరువు ఎంపీయుపీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా, 2001- 2006 వరకు కురిచేడు మండలం పొట్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, 2006 - 2015 వరకు దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 2015 - 2017 వరకు సింగరాయకొండలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేశారు. ఆ తర్వాత ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి పొంది త్రిపురాంతకం మండలం దూపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2021 వరకు పని చేసి, దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా బదిలీపై వచ్చారు. 2019లో జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా అవార్డుకు ఎంపికయ్యారు. దర్శి ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ తెప్పించి ఎన్‌సీసీ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2021-2023 దొనకొండ జెడ్పీలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ఆట వస్తువులు, లైబ్రరీ సమకూర్చేందుకు కృషి చేశారు.

ఇంటర్మీడియెట్ విద్యలో ఉత్తమ ఉపాధ్యాయునిగా రంగనాయకులు



ఒంగోలు: ఇంటర్మీడియెట్ విద్యలో ఉత్తమ ఉపాధ్యాయునిగా కేపీ రంగనాయకులను ప్రభుత్వం ప్రకటించింది. రాచర్ల మండలం గౌతవరం వాసి. 1995లో ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లలోనే ఆయన పదోన్నతి పొంది 1998లో అర్థవీడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తించారు. 2005-2011 వరకు కంభం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో, 2011-2017 వరకు ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో, 2017-18లో టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశారు. అనంతరం పదోన్నతిపై శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2021లో బదిలీపై నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు ప్రిన్సిపాళ్లు, 19 మంది జూనియర్ లెక్చరర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేయగా అందులో ప్రకాశం జిల్లా నుంచి కేపీ రంగనాయకులు ఒక్కరే ఉండడం గమనార్హం. ఈయన తల్లిదండ్రులు ఇరువురూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. ఈయనకు ఇద్దరు తమ్ముళ్లు, ముగ్గురు చెల్లెళ్లు, వీరందరూ కూడా ఉద్యోగులే. ఈయన సతీమణి యామినీ అమ్మాజి స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో తెలుగు అధ్యాపకురాలు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు
ఒంగోలు: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని ఉపాధ్యాలందరికీ స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావు, టీటీడీ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో అత్యుత్తమ ఆలోచనలున్న వారు ఉపాధ్యాయులు అని పేర్కొంటూ ఉత్తమ సేవలు అందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి అర్పించడంతోపాటు ఆయన జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలి
● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రాజ్యలక్ష్మి

ఒంగోలు సిటీ: నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చాంబర్‌లో నేత్రదాన పక్షోత్సవాలకు సంబంధించి ఆప్తమాలిక్ ఆఫీసర్స్‌కి సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కళ్లు దానం చేసినందున మరొకరు కంటి చూపు పొందుతారన్నారు. చూపు పొందిన వారు వాళ్ల జీవితంలో కొత్త వెలుగు చూడమేకాక, దానం చేసిన వారిని జీవితంలో మరిచిపోరని తెలిపారు. నేత్రదానం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ప్రతి ఒక్కరూ వాళ్ల తదనంతరం నేత్రదానం చేయాలన్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ నళిని, ఆప్తమాలిక్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

అవ్వాతాతల ఆశీర్వచనాలతో ప్రభుత్వం ముందుకు..
● నూతన పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి ఆదిమూలపు సురేష్



దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: అవ్వ, తాతల ఆశీర్వచనాలు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పకుండా పింఛన్‌దారులకు ప్రతి నెలా 1వ తేదీనే అందజేసేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. పింఛన్ పొందేందుకు కేవలం అర్హత మాత్రమే తమ ప్రభుత్వం చూస్తుందని, ఎటువంటి ఒత్తిడిలకు లోను కాకుండా అర్జీ దాఖలు చేసుకోవచ్చని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డులు, సదరమ్ సర్టిఫికెట్లు, పింఛన్, ప్రభుత్వ పథకాల కోసం అర్జీలు దాఖలు చేయాలంటే పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడేదన్నారు. తమ పార్టీ కండువా కప్పుకుంటేనే పథకాలు మంజూరవుతాయని పచ్చ నాయకులు చెప్పేవారని విమర్శించారు. గతంలో మాదిరిగా దూర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమకు సమీపంలోనే గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారని, ప్రజలకు సేవలు అందించేందుకు వలంటీర్ల వ్యవస్థను అమలులోకి తీసుకొచ్చారని చెప్పారు. 2019లో రాష్ట్ర ప్రజలు చక్కటి నాయకుడ్ని ఎన్నుకోవడం వల్లనే పథకాలన్నీ తమ వద్దకే చేరుతున్నాయని, ఇంకా ఈ పథకాలు కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎంను చేసుకోవటానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఎన్నికల ముందు ఒక మాట, ఆ తరువాత మరోమాట మాట్లాడే వారిని తరిమికొట్టే సమయం ఆసన్నమవుతుందని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి నెలా అన్ని రకాల పింఛన్లు 36,944 మందికి రూ.10 కోట్లు పంపిణీ చేస్తున్నారని, కొత్తగా 2042 పింఛన్లు మంజూరు చేశారని, ఇంకా ఎవరికైనా పింఛన్లు అందకుంటే తమ వలంటీరు ద్వారా సచివాలయంలో అర్జీ దాఖలు చేస్తే అవికూడా మంజూరు చేస్తారని చెప్పారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లు మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ టి.రవికుమార్, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, ఎంపీడీవోలు మరియదాసు, సాంబశివరావు, నాసర్‌రెడ్డి, ఎన్.విజయ, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, నాయకులు వై.వెంకటేశ్వరరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, పప్పర్తి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సహేతుకంగా అర్జీల పరిష్కారం
● స్పందనలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు



స్పందన కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు

ఒంగోలు సిటీ: 'స్పందన' అర్జీల పరిష్కారంలో సహేతుకత ముఖ్యమని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అంతకుముందు నిర్వహించిన 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకొని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని కచ్చితంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పిటిషన్లు రీ ఓపెన్ కాకుండా చూడాలని, ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. సమస్యను పరిష్కరించలేని పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మాధురి, లోకేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

■ పొదిలి మండలం, పొదిలి నుంచి సీహెచ్.అనుపమ ఫోన్ చేశారు. తమ పరిధిలోని బోర్ చెడిపోయిందని, కానీ ఇప్పటి వరకు రిపేరు చేయించలేదని తెలిపారు. సాగర్ నీరు కూడా రావడం లేదని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ స్పందిస్తూ వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

■ కొమరోలు మండలం, రెడ్డిచర్ల గ్రామం నుంచి ఎస్.పుల్లయ్య ఫోన్ చేశారు. రెడ్డిచర్ల గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా సరిగా స్పందించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశించారు.

■ మద్దిపాడు మండలం, అయ్యపురాజుపాలెం గ్రామం నుంచి కె.మాధవరావు ఫోన్ చేసి తమ గ్రామంలో సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా తాగునీటి సరఫరా సరిగా లేదని ఫిర్యాదు చేయగా ఇన్‌చార్జ్ కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

లోప రహితంగా ఓటర్ల జాబితా ఉండాలి
● ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.శ్రీనివాసులు



రీ వెరిఫికేషన్ చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు సిటీ: లోప రహితంగా ఓటర్ల జాబితా ఉండాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఒంగోలు నగరంలోని 117వ పోలింగ్ కేంద్రం, కొత్తపట్నం మండలం, అల్లూరులో చనిపోయిన ఓటర్ల తొలగింపుపై రీవెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డూప్లికేషన్ ఓటర్లను తొలగించడంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. గత ఏడాది జనవరి నుంచి తొలగించిన ఓట్ల విషయంలో ఈ నిబంధనలు పాటించిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్డీఓ విశ్వేశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ మురళి, కొత్తపట్నం తహశీల్దార్ రమణారావు, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్వోలు, ఇతర అధికారులు ఉన్నారు.

రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘ అసోసియేట్ అధ్యక్షునిగా మర్రి



మర్రి శ్రీనివాసరావు

సింగరాయకొండ: రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్రి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని రెవెన్యూ భవన్‌లో సోమవారం రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘ ఎన్నికలు జరిగాయి. ప్రకాశం జిల్లా నుంచి అసోసియేట్ అధ్యక్షునిగా మర్రి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మర్రి శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

ఒంగోలు టౌన్/మార్కాపురం: ప్రేమ, పెళ్లి పేరుతో వంచించాడని ఒక యువతి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఏఆర్ కానిస్టేబుల్ డి.సందీప్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ మలికా గర్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉలవపాడుకు చెందిన సందీప్ ప్రస్తుతం మార్కాపురం డీఎస్పీ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సొంతూరుకు చెందిన ఒక యువతిని ప్రేమ పేరుతో నమ్మించి ఏడేళ్లుగా కలిసి తిరిగారు. చివరికి పెళ్లికి చేసుకోకుండా మరో యువతితో వివాహానికి సిద్ధమైనట్లు తెలుసుకున్న సదరు యువతి స్పందనలో ఎస్పీ మలికాగర్గ్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో శాఖాపరంగా విచారణ చేపట్టారు. సందీప్‌ను సస్పెండ్ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు తాలుకా పోలీసులు సందీప్‌పై కేసు నమోదు చేయడం తెలిసిందే. ఇదిలా ఉండగా కొద్ది రోజుల క్రితం సందీప్‌తోపాటు ఆ యువతికి డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. సందీప్ వ్యవహారశైలి మారకపోవడంతో క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సిఫార్సు చేస్తూ డీఎస్పీ నివేదిక పంపారు.

వాగులో వ్యక్తి గల్లంతు


ఘటనా స్థలం వద్ద పోలీసులు

రాచర్ల: లోతువాగులో వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన మండలంలోని అక్కపల్లెలో జరిగింది. కంభం మండలం తుడిమెళ్ల గ్రామానికి చెందిన షేక్.మహమ్మద్ కాశింవలి అనే వ్యక్తి మోటారుసైకిల్‌పై సోమవారం రాచర్ల మండలంలోని పలు గ్రామాల్లో కూరగాయలు అమ్ముకుని తిరుగు ప్రయాణంలో తన స్వగ్రామం తుడిమెళ్ల గ్రామానికి వెలుతున్న సమయంలో అక్కపల్లె గ్రామ సమీపంలోని ఉధృతంగా ప్రవహిస్తున్న లోతు వాగులో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయాడు. లోతువాగులో కొట్టుకుపోతున్న షేక్ మహమ్మద్ కాశింవలిని స్థానికులు చూసి తాళ్ల సహాయంలో బయటికి తీసే ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకపోయింది. లోతువాగు వాగులో కొట్టుకుపోయిన వ్యక్తి కోసం అటు లోతువాగుతో పాటు గుండ్లకమ్మ వాగుల్లో రాచర్ల పోలీసులతో పాటు గ్రామ వలంటీర్లు గాలింపులు చేపట్టినా గల్లంతైన వ్యక్తి అచూకీ లభ్యం కాలేదని రాచర్ల హెడ్‌కానిస్టేబుల్ సురేష్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


దాబరావు మృతదేహం

ఒంగోలు టౌన్: కూలి పనుల కోసం వచ్చిన మహారాష్ట్రకు చెందిన వ్యక్తి ఒకరు అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం...మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన దావల దాబరావు (45) గత కొంతకాలంగా ఒంగోలులో కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం దశరాజుపల్లి అడ్డరోడ్డు వద్ద డొంక్లో అతడి మృతదేహం పడి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న తాలుకా సీఐ పి.భక్తవత్సలరెడ్డి, ఎస్సై మలికార్జునరావు, పోలీసు సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి జేబులో సెల్‌ఫోన్, ఫోన్ నంబర్లతో కూడిన పుస్తకం లభ్యమైంది. దీంతో మృతుడిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'జల్‌జీవన్' పనుల పరిశీలన


గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న సెంట్రల్ నోడల్ ఆఫీసర్ మనోజ్ బాప్నా

మద్దిపాడు: కేంద్ర ప్రభుత్వం ద్వారా పలు గ్రామాల్లో అమలవుతున్న జలజీవన్ మిషన్‌ల స్థితిగతులను సెంట్రల్ నోడల్ ఆఫీసర్ అండ్ డైరెక్టర్ ట్రైబల్ అఫైర్స్ మనోజ్ బాప్నా సోమవారం సాయంత్రం కొలచనకోట గ్రామంలో పరిశీలించారు. జల్‌జీవన్ కింద అందిస్తున్న నీటిని వాడుకకు వినియోగిస్తున్నామని, తాగడానికి సమీపంలోని ఆర్‌ఓ ప్లాంటు నుంచి నీరు తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు చెప్పడంతో కారణాలపై ఆరా తీశారు. గతంలో ఉన్న బావి నీరు ప్రస్తుతం రుచికరంగా లేదని అందువలన నీరు ఆర్‌ఓ ప్లాంటు ద్వారా నీరు తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. దీంతో ఆయన నీటి శాంపిల్స్‌ను టెస్టింగ్‌కు పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అనంతరం గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆయన వెంట టెక్నికల్ ఆఫీసర్ పీ యాదయ్య, పీడీ డ్వామా కే శీనారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలి, ఈఈ శ్రీనివాస్, ఎంఈఓ ఏపీఓ మధుసూదనరావు, ఏపీడీ డ్వామా వెంకటస్వామి, ఏఈ మహేంద్రరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీపీఎంయూ ఒంగోలు టీమ్, దర్శి సుధీర్, డాక్టర్ కే మోహనరావు, డి.రవి, ప్రేరణ (ఐఎస్‌ఏ), కే వెంకటేశ్, సర్పంచ్ డీ మరియమ్మ గ్రామ నాయకుడు విల్సన్, పంచాయతీ సెక్రటరీ సుశాన్ రూత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

- హైవే పక్కన రూ.కోట్ల విలువైన గ్రామకంతం భూమి కబ్జా
- మొక్కుబడిగా రెవెన్యూ అధికారుల చర్యలు
- ఆక్రమణదారులకు అండగా నిలిచారంటూ ఆరోపణలు


ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏర్పాటు చేసిన కంచె


చిల్లకంపలో పడేసిన హెచ్చరిక బోర్డు

బేస్తవారిపేట: హైవే పక్కన ఎంతో విలువైన గ్రామకంతం ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వదిలేశారు. బేస్తవారిపేట మండలం చింతలపాలెం బస్టాండ్ సమీపంలో తోకపల్లె-కడప జాతీయ రహదారి పక్కన గ్రామకంతం ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 150/2లో 5.02 ఎకరాలు ఉంది. అందులో దాదాపు 80 సెంట్ల గ్రామకంతం భూమిని ఇద్దరు వ్యక్తులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై 15 ఏళ్ల క్రితం ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇంటి స్థలాలు లేనివాళ్లకు గ్రామకంతం భూమిని నివేశన స్థలాలుగా ఇవ్వాల్సి ఉంది. రెవెన్యూ అధికారులు భారీగా ముడుపులు పొంది గ్రామానికి సంబంధం లేని వ్యక్తులకు అప్పట్లో అక్రమంగా ఆన్‌లైన్ చేశారని గ్రామస్తులు ఆరోపిస్తుండగా, ప్రస్తుతం మళ్లీ ఖాళీగా ఉన్న 2 ఎకరాల భూమి అన్యాక్రాంతమవుతోంది. హైవే పక్కన నివేశన స్థలాలకు ఉపయోగపడే కోట్ల రూపాయల ఖరీదైన భూమిని ఆక్రమించుకుంటున్నారు. దీనిపై గ్రామస్తులు పలుమార్లు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇదే అదునుగా ఖాళీగా ఉన్న భూమిని ఆక్రమించిన ఒకరు వరి పంట సాగు చేపట్టారు. పక్కనున్న భూమిని చదును చేశారు. భారీగా ముడుపులు అందడంతో రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫొటో ఫోజు కోసం హెచ్చరిక బోర్డు...

పలుమార్లు తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో గ్రామస్తులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు తప్పనిసరి పరిస్థితుల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి వీఆర్వో, వీఆర్ఏలు ఫొటో దిగారు. గ్రామకంతం భూమి వద్ద ఫొటో దిగిన అనంతరం ఆ ఫ్లెక్సీని చిల్లచెట్లలో పడేశారు. ఆక్రమణలపై చర్యలు తీసుకున్నాము, బోర్డు కూడా ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించామని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రెవెన్యూ యంత్రాంగం పెద్ద డ్రామా నడిపిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ డీవీబీ వరకుమార్‌ను వివరణ కోరగా, ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ గ్రామకంతం భూమిలో హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు.

సంక్షేమాన్ని ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయ్

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- రూ.90 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం
- పిడికిటివానిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం


లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు వాటిని తిప్పికొట్టి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని పిడికిటివానిపల్లి సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని, రూ.20లక్షలతో నిర్మించిన సైడు కాలవలు, రూ.25 లక్షలతో జలజీవన్ పనులకు , రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ కార్యక్రమాన్ని కొనసాగించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ పాలనలో, సంక్షేమ పథకాల అమలులో చరిత్ర సృష్టించిన నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు అధికారులు ఉండాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు కావాల్సిన ప్రతి పథకాలన్నీ ఇంటి ముంగిటకే అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలుతున్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తుందంటే ఇటీవల అమెరికాలో విద్యను అభ్యసించేందుకు దేశవ్యాప్తంగా 30 మంది విద్యార్థులు ఎంపిక కాక రాష్ట్రం నుంచి 5 మంది విద్యార్థులు ఎంపికయ్యారంటే రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని అన్నారు. పలువురు మంత్రి దృష్టికి తీసుకువచ్చిన చిన్ని చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామపురవీధుల్లో మంత్రి సురేష్‌కు పూలమాలలు, శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ లాజర్, సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గాలిరెడ్డి, డీడీఓ సాయికుమార్, తహశీల్దార్ దాసు, ఎంపీడీఓ మరియదాసు, ఎంఈఓ ఇందిర, ఏఈ కిషోర్, ఏపీఎం వెంకటయ్య, నాయకులు డిష్ వెంకటరెడ్డి, మస్తాన్‌రెడ్డి, పెద్దినేని రవణయ్య, రామిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయ ఉద్యోగి ఇంట్లో చోరీ

- 6 సవర్ల బంగారం, రూ.20 వేల నగదు అపహరణ
- పాత నేరస్తుల పనేనని పోలీసుల అనుమానం


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లిన ఎస్పీ కార్యాలయ ఉద్యోగి నివాసంలో దొంగలు చొరబడి నగలు, నగదు కాజేసిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్న డేగల సోమనాథ్ సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ సాయినగర్-4వ లైనులో నివాసం ఉంటున్నారు. ఈనెల ఒకటో తేదీ శుక్రవారం గుంటూరులో తన బంధువుల ఇంట్లో వివాహ మహోత్సవానికి కుటుంబ సమేతంగా వెళ్లారు. ముందుగా సోమనాథ్ తల్లి జ్యోతిలక్ష్మి ఇంటికి వచ్చారు. అప్పటికే తలుపు తెరిచి ఉండటాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్, బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువా లాకర్‌లో దాచి ఉంచిన 6 సవర్ల బంగారం, 20 వేల రూపాయల నగదు చోరీకి గురయ్యాయని సోమనాథ్ తల్లి గుర్తించారు. వెంటనే కుమారుడు సోమనాథ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. చోరీ జరిగిన ఇంటిని సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి.శ్రీరామ్ పరిశీలించారు. ప్రధాన ద్వారానికి ఉన్న తాళాన్ని ఇనుప రాడ్‌తో పెకిలించి చోరీకి పాల్పడ్డారని, ఇది పాత నేరస్తుల పనే అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలు ముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫేస్‌బుక్‌లో బైక్ విక్రయం పేరుతో కుచ్చుటోపీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఫేస్ బుక్‌లో వచ్చిన ప్రకటనను నమ్మి మోసపోయాడు ఓ యువకుడు. అన్ని రకాలుగా మంచి కండిషన్‌లో ఉన్న బైకును అతి తక్కువ ధరకు విక్రయించనున్నట్లు ఫేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటనను నమ్మిన కొత్తపట్నం మండలానికి చెందిన ఎం.పవన్ కుమార్ వెంటనే అందులో ఇచ్చిన నంబరుకు ఫోన్ చేశాడు. బైకు కొనేందుకు తన సంసిద్ధత తెలియజేశాడు. అయితే తనకు అత్యవసరంగా డబ్బు కావాలని చెప్పిన బైకు యజమాని 25 వేల రుపాయలను ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. డబ్బు తీసుకున్న తరువాత ఫోన్ లిఫ్ట్ చేయడం మానుకున్నాడు. బైకు ఇవ్వకపోగా, డబ్బు కూడా తిరిగివ్వక పోవడంతో మోసపోయినట్లు గ్రహించిన పవన్ స్పందనలో ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన ఎస్పీని కలిసి తనకు జరిగిన మోసాన్ని వివరించారు. అలాగే యర్రగొండపాలేనికి చెందిన మాలకొండనాయక్ తనకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 2.50 లక్షల రుపాయలు తీసుకున్నాడని, ఉద్యోగం ఇప్పించకపోవడంతో తన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే బెదిరిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన జి.ఆత్మ ఫిర్యాదు చేశారు. జరుగుమల్లి మండలానికి చెందిన మాధవ చీటీపాటల పేరుతో నెలకు 10,500 రుపాయలు చొప్పున 14 నెలలపాటు కట్టించుకున్నాడని, తీరా చీటీ గడువు ముగిశాక డబ్బు అడుగుతుంటే అసభ్యపదజాలంతో దూషిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. స్పందనలో మొత్తం 102 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించిన ఎస్పీ.. ఆయా స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. చట్ట పరిధిలో విచారించి సమస్యలను పరిష్కరిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. స్పందన ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శ్రీనివాసరెడ్డి, ప్యానల్ అడ్వకేట్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

565 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం లారీని సివిల్ సప్లయ్ గోడౌన్‌కు తరలించిన అధికారులు

దర్శి: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న 565 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు సీజ్ చేశారు. దర్శి పట్టణంలోని ఓ రైస్ మిల్‌లో ఒంగోలు పౌర సరఫరాల శాఖాధికారులు 290 బస్తాలు రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి వేళ ఒంగోలుకు చెందిన డీటీలు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, ఆర్.డేవిడ్‌రాజు, ఎస్‌కే మస్తాన్, చీరాల కష్ణమోహన్ రైస్‌మిల్‌ను తనిఖీ చేశారు. లారీలో 75 బస్తాలు, మిల్‌లో 215 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. మినీ లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ యజమాని సుధాకర్‌రెడ్డి, మిల్ లీజుకు తీసుకున్న శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

సింగరాయకొండలో 275 బస్తాలు..

సింగరాయకొండ: అక్రమంగా మినీ లారీలో తరలిస్తున్న 275 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎన్.రాఘవరావు సీజ్ చేశారు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై సింగరాయకొండలోని బాలయోగి నగర్ వద్ద వైఎస్సార్ ఆర్చి సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. కందుకూరుకు చెందిన మాధవరావు చుట్టుపక్కల గ్రామాల నుంచి బియ్యాన్ని సేకరించి లారీలో లోడ్ చేయించాడు. పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి సీఐ దాడి చేశారు. రేషన్ బియ్యం గోతాలు కూడా మార్చకుండా తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని స్థానిక సివిల్ సప్లయ్ గోడౌన్‌లో అప్పగించారు. లారీని సీజ్ చేశారు. కావలికి చెందిన డ్రైవర్ దేవరపల్లి సంపత్‌ను అదుపులోకి తీసుకుని నాన్‌బెయిలబుల్ క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ రాఘవరావు తెలిపారు. సూత్రధారిపైనా కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. దాడిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై జి.నాగేశ్వరరావు, సివిల్ సప్లయ్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి హత్య కేసు విచారణ వేగవంతం

- పోలీసులు అదుపులో బాలుడి తండ్రితో పాటు మరో ఆరుగురు
- మృతదేహాన్ని పరిశీలించిన ట్రైనీ ఎస్పీ అంకిత సురాన
- మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి


ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఎస్పీ అంకిత సురాన

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని చింతలపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 16 నెలల బాలుడు సాత్విక్ షాలోన్ అదృశ్యం, ఆపై మృతి ఘటన కేసు విచారణను వేగవంతం చేసినట్లు సీఐ కాటూరి శ్రీనివాసరావు తెలిపారు. గత నెల 30వ తేదీ బుధవారం అర్ధరాత్రి తల్లి, పక్కన నాయనమ్మతో కలిసి పడుకుని ఉన్న సాత్విక్‌షాలోన్ కిడ్నాప్‌కు గురి కాగా ఈనెల 3వ తేదీ ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని పొలాల్లో మృతదేహం లభ్యమైంది. సోమవారం ట్రైనీ ఎస్పీ అంకిత సురాన, క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, పామూరు సీఐ కాటూరి శ్రీనివాసరావులు మరోమారు క్షేత్రస్థాయిలో పరిశీలించి బాలుని మృతితీరుపై చర్చించారు.

అనుమానితుల విచారణ..

బాలుని మృతికి సంబంధించి బాలుని తండ్రి మైలారి సామ్యేలుతో పాటు గ్రామానికి చెందిన మరో ఆరుగురిని అనుమానితులుగా భావించి వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో మరికొందరిని కూడా ఘటనపై విచారణ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. మృతుని తల్లి కెజియా, నాయనమ్మ తిరుపతమ్మలను ట్రైనీ ఎస్పీ అంకిత సురానా స్టేషన్‌కు పిలిపించి విచారించి పంపించివేశారు. బాలుడు సాత్విక్ మృతదేహానికి ఒంగోలు రిమ్స్‌లో సోమవారం సాయంత్రం పోస్టుమార్టం పూర్తి చేయగా, నివేదికలు రావాల్సి ఉందన్నారు. కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని, ప్రస్తుతం విచారణ ఎదుర్కొంటున్న వారిలోనే ఒకరు హత్య చేసి ఉండవచ్చని భావిస్తున్నట్లు సీఐ తెలిపారు. విచారణలో సీఐలు కె.శ్రీనివాసరావు, శివరామక్రిష్టారెడ్డి, రాఘవేంద్రరావు, పాపారావు, పాండురంగారావులు, ఎస్సైలు పి.అనిల్‌కుమార్, కె.సురేష్, పి.మహేష్‌కుమార్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల ప్రాణాలు కాపాడిన

పోలీసులకు ప్రశంసలు


గిద్దలూరు పోలీసులతో ఎస్పీ మలికాగర్గ్

- ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: ఒకవైపున ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం...మరో వైపు ఉధృతంగా పారుతున్న వాగు. వాగు మధ్యలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్న ఇద్దరు యువకులు. అయితేనేం...విధి నిర్వహణే ముఖ్యం అనుకున్నారు ఆ పోలీసులు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఇద్దరు యువకుల ప్రాణాలను కాపాడారు. అటు ఉన్నతాధికారులు, ఇటు అశేష ప్రజల నుంచి అభినందనలు అందుకుంటున్నారు. గిద్దలూరు- అంబవరం చప్టాపై ఉప్పువాగు దాటుతూ నీటిలో కొట్టుకుని పోయిన గిద్దలూరు యువకులను కాపాడిన పోలీసులను ఎస్పీ మలికా గర్గ్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. గిద్దటూరు సీఐ పి.దేవ ప్రభాకర్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు కేఎం మధుసూదన్, నరసింహులు, మస్తాన్, సాంబ, హోంగార్డులు రవి, కృష్ణారెడ్డిలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు పాల్గొన్నారు.

ఏం జరిగిందంటే..

ఆదివారం తెలవారుజామున జోరున వర్షం కురుస్తున్న సమయంలో అత్యవసర పని నిమిత్తం బయటకు వచ్చిన గిద్దలూరుకు చెందిన షేక్ రహీం, షేక్ ఖలీల్‌లు మోటారు బైక్‌పై చప్టా దాటుతుండగా వాగు పొంగడంతో నీటిలో కొట్టుకొపోయారు. నీటి ఉధృతికి 50 మీటర్ల మేర కొట్టుకొని పోయిన వారికి ఒక చెట్టు కొమ్మ చేతికి దొరికింది. దాంతో వారు ఆ చెట్టు కొమ్మను అలాగే పట్టుకొని వేలాడుతూ రక్షించమని కేకలు వేస్తుండగా ఆ సమయంలో అటు వెళుతున్న అంబవరం గ్రామానికి చెందిన రమణ వెంటనే 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన కంట్రోలు రూం సిబ్బంది గిద్దలూరు సీఐ దేవ ప్రభాకర్‌కు తెలియజేశారు. పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకున్న ఆయన తాడు సహాయంతో ఉధృతంగా పారుతున్న వాగులోకి దిగి యువకులను కాపాడారు. అప్పటికే అక్కడికి చేరుకున్న వారి కుటుంబ సభ్యులకు వారిని సురక్షితంగా అప్పగించారు.

ఇద్దరు ఎస్సైలకు అటాచ్‌మెంట్

ఒంగోలు టౌన్: వీఆర్‌లో ఉన్న ఇద్దరు ఎస్సైలను పోలీస్ స్టేషన్లకు అటాచ్‌మెంట్ చేస్తూ ఎస్పీ మలికాగర్గ్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. వీఆర్‌లో ఉన్న ఎస్సై ఎల్.సంపత్ కుమార్‌ను ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు, యు.పున్నారావును తాలుకా పోలీసు స్టేషన్‌కు అటాచ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.